2024 ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 1 జనవరి 2024





న్యూ ఇయర్ హంగామా

- అంబరాన్నంటిన సంబరాలు
- మద్యం, మాంసం అమ్మకాల జోరు
- విస్తృతంగా పోలీసుల తనిఖీలు

నస్పూర్, డిసెంబరు 31 : కాల చక్రంలో మరో ఏడాది కనుమరుగైంది. గడిచిన ఏడాది మిగిల్చిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ 2024 నూతన సంవత్సరానికి కోటి ఆశలతో ఆదివారం రాత్రి స్వాగతం పలికారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర సంబరాలను జరుపుకున్నారు. నూతన సంవత్సర పురస్కరించుకొని మద్యం, మాంసం, చికెన్, కేక్‌లు, కూల్ కేక్‌లు, రంగవల్లుల అమ్మకాలు జోరుగా కొనసాగాయి. యేడాది చివరి రోజు ఆదివారం కలిసి రావడంతో ముందస్తుగానే విందులు, సంబరాల కార్యక్రమాలు మొదలయ్యాయి. రాత్రి 12 గంటల సమయం దాటి కొత్త సంవత్సరంలోకి ప్రవేశించగానే సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడల్లో, ఇళ్ళు, అపార్టుమెంట్ల వద్ద నృత్యాలు చేస్తూ కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంబరాలు జరిపారు. కొత్త ఏడాదిలో అడుగు పెట్టగానే సంబరాలు అంబరాన్ని అంటాయి. వాడవాడల యువతీ యువకులు, పిల్లలు, పెద్దలు కేరింతలు, శుభాకాంక్షలు, సెల్‌ఫోన్ ద్వారా మెసెజ్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందోత్సవాల మధ్య కొత్త సంవత్సర సంబరాలను ఘనంగా జరిగాయి. 2024 సంవత్సరం అంతా మంచి జరుగాలని ప్రజలు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మద్యం, మాంసం అమ్మకాల జోరు...

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాల జోరుగా సాగాయి. మద్యంకు తోడు చికెన్, మాంసం, చేపల అమ్మకాలు జరిగాయి. కిలో చికెన్ రూ. 200 నుంచి 220 వరకు, మటన్ రూ. 700 నుంచి 800 వరకు అమ్మకాలు జరిగాయి. పెద్ద మొత్తంలో మద్యంను అమ్మకాలు జరిగాయి.

మార్కెట్‌లో సందడి...

జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లోని మార్కెట్లలో జనంతో సందడి నెలకొంది. ముగ్గులకు అవసరమైన వివిధ రకాల రంగులు కిలో రూ. 20, కేక్‌లు కిలో రూ. 200 నుంచి 250 వరకు, టపాసులు వివిధ రకాల కలర్స్ అమ్మకాలు జోరుగా సాగాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి ఇళ్ళ ముంగిట మహిళలు ముగ్గులు వేసి రంగులతో అందంగా తీర్చిదిద్దుతారు. మార్కెట్లో లభించే రంగులను కొనుగోలు చేసి ఆ రంగులతో ముగ్గులను చూడ ముచ్చటగా అలంకరించారు. కొత్త ఏడాది సందర్భంగా చిన్నారులు సంతోషంగా ఎగు రవేయడానికి గాలి పటాలను కొనుగోలు చేశారు.

పోలీసుల ఆంక్షలు...

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలపై పోలీస్‌లు ఆంక్షలు విధించారు. రాత్రి 8 గంటల నుంచి రోడ్లపై స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పట్టుబడితే కేసులు పెట్టి బైండోవర్ చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని, విచ్చల విడిగా మద్యం మత్తులో రోడ్లపైకి వచ్చి వాహనాల్లో తిరిగితే చర్యలు ఉంటాయంటున్నారు. ప్రమాదాల నియంత్రణకు పెట్రోలింగ్‌ను ముమ్మరంగా చేపట్టారు.


మంచిర్యాలలో పూలు, రంగుల అమ్మకాలు


మందమర్రి పట్టణంలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

జోరుగా కేక్‌ల అమ్మకాలు

మందమర్రి టౌన్, డిసెంబరు 31: పట్టణంలోని మార్కెట్ సెంటర్లో నూతన సంవత్సర వేడుకలకు కేక్‌లు, రంగుల విక్రయాలు జోరుగా సాగాయి. బేకరీలు, స్వీట్‌హౌజ్‌ల నిర్వాహకులు ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేశారు. రెండు కిలోల కేక్ కొంటే కేజీ కేక్ ఫ్రీ అని ప్రకటించారు. మార్కెట్‌లోని ఆయా సెంటర్లలో రంగుల షాపులకు కూడా గిరాకీ పెరిగింది. ఎటు చూసినా బేకరీలతో పాటు రంగుల దుకాణాల్లో కొనుగోళ్ల దృశ్యాలు దర్శనమిచ్చాయి. ఆదివారం కావడంతో మద్యం విక్రయాలు ఊపందుకున్నాయి. ఒక మేక పది వేలు, నాటు కోడి కిలో 600 చొప్పున విక్రయించారు. వివిధ హోటళ్ల నిర్వాహకులు వంటలు వడ్డించేందుకు ఆర్డర్స్‌పై ఆఫర్ల బోర్డులు పెట్టారు.




మందమర్రి పట్టణంలోని స్వీట్ షాపులో రద్దీ

20న అవిశ్వాసంపై బల నిరూపణ

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 31: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్‌చైర్మన్ రాచకొండ గిరిష్‌పై అవిశ్వాసం కోసం 24మంది కౌన్సిలర్లు రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. బలనిరూపణకు జనవరి 20న సమావేశం ఏర్పాటు చేయాలని, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌కు, మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో కౌన్సిలర్లు శిబిరం బాటపట్టారు. 2/3 మెజార్టీ కౌన్సిలర్ల బలాన్ని చూసిన తర్వాత స్పెషల్ అధికారి, ఆర్డీవో పాలక వర్గంపై నిర్ణయం ప్రకటిస్తారు. ఈ బలనిరూపణకు 21మంది కౌన్సిలర్లు హాజరు కాకుంటే కోరం లేక అవిశ్వాసం వీగినట్టుగా ప్రకటించే అవకాశాలున్నాయి.

లారీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

కాసిపేట, డిసెంబరు 31: ఇటీవల కేంద్రప్రభుత్వం లారీడ్రైవర్లపై విధించిన చట్టాలను ఎత్తివేయాలని ఆదివారం దేవాపూర్‌లో ఆందోళనచేపట్టారు. లారీ డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయేల్ మాట్లాడుతూ లారీ డ్రైవర్ వల్ల ప్రమాదం సంభవిస్తే పదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.7లక్షలు జరిమానా విధించే చట్టాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లారీడ్రైవర్ల సంఘం నాయకులు ఎండి సాదిక్, పి పోషం, షేర్‌ఖాన్, గట్టయ్య, దుర్గయ్య మద్దినేని భీమయ్య, కిషన్, రాంచందర్, నాయిని కిరణ్, నజీర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ఓదెలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓదెలు

మందమర్రి టౌన్, డిసెంబరు 31 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఇటీవల చెన్నూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయన అధిష్టానం సూచన మేరకు వివేక్ గెలుపు కోసం పని చేశారు. ప్రభుత్వం ఏర్పడినందున ఏదైనా పదవి కావాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలుస్తోంది. నాయకులు దుర్గం నరేష్, నల్లాల క్రాంతి ఉన్నారు.

ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి



ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, భైరవ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఏసీసీ, డిసెంబరు 31: మంచిర్యాల రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఓవర్‌బ్రిడ్జి మరమ్మతు పనులను పరిశీలించి పనుల పురోగతిని కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఓవర్‌బ్రిడ్జిపై గుంతలు పడి ఇనుప రాడ్లు పైకి తేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వం మరమ్మతు చేయలేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఓవర్‌బ్రిడ్జిపై మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని అధికారులను ఆదేశించానన్నారు. ఆధునిక పద్ధతిలో డాంబర్ షీట్ వేస్తున్నామని, దాదాపు రూ.15 లక్షలు వెచ్చించి డాంబర్ షీట్ తెప్పించామన్నారు. చెన్నైకి చెందిన టెక్నికల్ టీం షీట్‌ను వేస్తున్నారని, ఇకపై ఓవర్‌బ్రిడ్జి మీదుగా సేఫ్‌గా ప్రయాణిస్తారన్నారు. సంక్రాంతి నుంచి మంచిర్యాల, నస్పూర్, లక్శెట్టిపేట మున్సిపాలిటీల్లో స్వచ్ఛమైన గోదావరి తాగు నీరు రోజు రెండు గంటలు సరఫరా చేస్తామన్నారు. పట్టణ అధ్యక్షుడు నరేష్, కౌన్సిలర్ బానేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, వెంకటేశ్వర్‌రావు, కాంట్రాక్టర్ రవిందర్‌రావు పాల్గొన్నారు.

భైరవ స్వామికి ఎమ్మెల్యే పూజలు

కోటపల్లి: మండలంలోని పారుపల్లి గ్రామంలో గల కాలభైరవ స్వామిని ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దర్శించుకున్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరినట్లు పేర్కొన్నారు. నూకల రమేష్, రాజమల్లా గౌడ్, మహేష్ తివారీ, బాపగౌడ్, మారు పాక సుజేందర్, సురేష్, సంపత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మందమర్రి రూరల్, డిసెంబరు 31 : మండలంలోని మామిడిగట్టులో ఆదివారం ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కామెర రఘు మామిడిగట్టు నుంచి వస్తుండగా ఆదిలాపేట్ వెళ్తున్న దుర్గం ప్రశాంత్ ద్విచ్రక వాహనాలు ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. రఘు కాలు విరగడంతో కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 31: అయోధ్య పూజిత అక్షింతల శోభయాత్రను జిల్లాకేంద్రంలో ఆదివారం ఆద్యంతం ఉత్సాహంగా నిర్వహించారు. ఆరడుగుల శ్రీరాముడి విగ్రహం, అక్షింతలతో నిర్వహించిన శోభాయాత్రకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతకుముందు శోభాయాత్రను ఎమ్మెల్యే కోవ లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీరాముడి నామస్మరణతో జిల్లాకేంద్రంలోని వీధులు మార్మోగాయి. ప్రధానరహదారి గుండా మహిళలు చేసిన నృత్యాలు, కోలాటాలు ఆకర్షించాయి. శోభాయాత్రలో అయ్యప్ప మాలాధారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, శ్యాంనాయక్, విశాల్, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర పెంచాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 31: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తికి మద్దతు ధర పెంచాలని రైతుసంఘం జిల్లాఅధ్యక్షుడు ఉప్పరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర లేక రైతులు చాలా నష్టపోతున్నారని అన్నారు. గతసంవత్సరం ప్రైవేటువ్యాపారులు క్వింటాలుకు రూ.9నుంచి రూ.10వేల వరకు ధర పెట్టారని, కానీ ఈసారి రూ.6500నుంచి రూ.7వేలవరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. సీసీఐరేటు క్వింటాలుకు రూ.7020 ఉన్నా సీసీఐ అధికారులు తేమశాతం ఎక్కువ చూపిస్తూ రూ.6800నుంచి రూ.7 వేల వరకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తికి రూ.10వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి, డిసెంబరు 31: పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. ఆదివారం కెరమెరి పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా మెలగాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలన్నారు.

న్యూ ఇయర్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

బెజ్జూరు/కెరమెరి: మండలంలో, గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సైలువిక్రమ్, విజయ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ రోడ్లపై తాగి గొడవలకు దిగవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో సంబరాలు జరుపుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 31: ఈనెల 1నుంచి3వరకు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందినవిద్యార్థులు ఎంపికైనట్లుప్రిన్సిపాల్ కృష్ణారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డీడీ రమాదేవి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

వెలిసిన కేక్ దుకాణాలు

సిర్పూర్(టి), డిసెంబరు 31: పాత సంవత్సరం వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలకే వారి కోసం మండల కేంద్రంలో కేకుల దుకాణాలు వెలిశాయి. ఈ సందర్భంగా కేకులు కొనుగోలు చేసేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపించారు. గ్రామాల నుంచి సైతం యువత వచ్చి కేక్‌లను కొనుగోలు చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

పెంచికలపేట, డిసెంబరు 31: మండలంలోని బొంబాయిగూడలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్‌వ్యాన్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చింతలమానేపల్లి: కర్జవెల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రకు సంబంధించిన పోస్టర్లను బీజేపీ నాయకులు ఆదివారం విడుదల చేశారు. నాయకులు తిరుపతి, రంగన్న, సర్పంచ్ నానయ్య పాల్గొన్నారు.

షష్ఠి బోనాలు

కాగజ్‌నగర్, డిసెంబరు 31: ఈసుగాం శివమల్లన్న ఆలయంలో షష్ఠిబోనాల కార్యక్రమాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. క్షీరాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనను సన్మానిం చారు.

దివ్యాంగులను ఆదరించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 31: సమాజంలో ఉన్న దివ్యాంగులను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక బాలభారతి పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

గిరిజనుల అభివృద్ధికి జనజాతి మహాఅభియాన్

ఆసిఫాబాద్, డిసెంబరు 31: గిరిజనుల సమగ్ర అభివృద్ధికోసం కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతీయ మహాఅభియాన్ పథకం ద్వారా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడానికి చర్యలు తీసుకుంటుందని గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవిఅన్నారు. ఆదివారంప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ కార్డులనుజిల్లాకేంద్రంలోని రవిచంద్ర కాలనీలో గిరిజనులకు అందించి చైతన్యపరిచారు.

కోనేరు కోనప్ప పరామర్శ

కౌటాల, డిసెంబరు 31:కౌటాల వైస్‌ఎంపీపీ నికోడే అమ్మక్క, మాజీఎంపీపీ నికోడే గంగారాంను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం పరామర్శించారు. అమ్మక్క తల్లి రెండురోజుల క్రితం మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



మాట్లాడుతున్న పార్వతి సత్యనారాయణ

ఏసీసీ, డిసెంబరు 31: పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పర్వతి సత్యనారాయణను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, రవికాంత్‌రావు, అర్కల కుమార్, కొత్త సురేష్, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై నరేష్‌కుమార్

హాజీపూర్, డిసెంబరు 31: గుడిపేట శివారులో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పోటీలు హోరెత్తించాయి. తిప్పని మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. 20 బండ్లు పాల్గొనగా ఎస్సై నరేష్ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ప్రథమ బహుమతి అచ్చలాపూర్ చెందిన కోటిపల్లి సాగర్ గెలుపొందగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఒడ్డె శ్రీనివాస్‌లు 3 గ్రాముల బంగారం అందించారు. ద్వితీయ బహుమతి పాత మంచిర్యాలకు చెందిన తూముల వెంకటరామయ్య గెలుపొందగా 6 గ్రాముల వెండి కందుల రమేష్ అందించారు. తృతీయ బహుమతి పెంచాల లక్ష్మణ్ గెలువగా ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు 4 గ్రాముల వెండి బహుమతి అందించారు. అత్తె శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. రాజమౌళి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సురేందర్‌లు పాల్గొన్నారు.

సెల్ టవరెక్కిన మతిస్థిమితం లేని మహిళ

దండేపల్లి, డిసెంబర్ 31 : మండల కేంద్రానికి చెందిన బొడ్డు బక్కవ్వ మతిస్థిమితం సరిగా లేక ఆదివారం ఉదయం బస్టాండ్ సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కడంతో కలకలం రేపింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు మూడు గంటల పాటు సెల్ టవర్‌పైనే ఉండటంతో స్థానికులు భయాందోళన చెందారు. ఎస్సై ప్రసాద్ స్థానిక యువకుల సాయంతో కిందికి దించారు.

లారీ ఢీకొని నాలుగు గేదెలు మృతి

జైపూర్, డిసెంబరు 31: ఇందారం బస్టాండ్ సమీపంలో లారీ ఢీకొని నాలుగు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మేకల సత్య నారాయణ, మేకల తిరుపతిలకు చెందిన గేదెలు ఆదివారం రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. మరో నాలుగు గేదెలకు గాయాలయ్యాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని వారు పేర్కొన్నారు.

జిల్లాలో కళాకారులకు కొదువలేదు

మందమర్రి టౌన్, డిసెంబరు 31: జిల్లాలో కళాకారులకు కొదువ లేదని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు అన్నారు. ఆదివారం సింగరేణి పాఠశాల మైదానంలో క్రేజీ స్టార్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఆమె హాజరై మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు యేటా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కొమ్మెర విశ్వేశ్వరశర్మ, కిరణ్మయి, శ్రీనివాస్, నరేష్, సలేంద్ర సత్యనారాయణ, మల్లేష్, రవిందర్, నాగరాజు, శాంభరి, చంద్రశేఖర్, రాకం సంతోష్ పాల్గొన్నారు.

అక్షింతల శోభాయాత్ర

ఏసీసీ, డిసెంబరు 31: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముని అక్షింతలు ఆదివారం జిల్లా కేంద్రంలో ఊరేగించారు. మహిళలు కోలాటాలతో శోభాయాత్ర నిర్వహించారు. అశోక్ గ్రౌండ్ మీదుగా ప్రారంభమైన యాత్ర వసంత్ టాకీస్ ఏరియా సీతారామ కాలనీ, బృందావన కాలనీ, 7హిల్స్ కైలాసగిరి కాలనీల మీదుగా కాకతీయ కాలనీ వరకు కొనసాగింది. అక్షింతలను సోమవారం ఉదయం భక్తులకు పంపిణీ చేయనున్నారు. ముడుపు యాదిరెడ్డి, తోట సదానందం, శంకరయ్య, రాజు యాదవ్, వేముల రమేష్, నర్సయ్య, మల్యాల రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.



నింగినంటిన కూరగాయల ధరలు



కెరమెరి, డిసెంబరు 31: మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించేవారసంతలో కూరగాయల రేట్లు నింగినంటాయి. మండలంలో ఎక్కువగా పత్తి, కంది పండిస్తున్న నేపథ్యంలో కూరగాయలు ఇతరప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి. కాగా ఆదివారం జరిగిన వారసంతలో కిలో టమాట రూ.30, బెండకాయ రూ.100, గోబీ రూ.100, చిక్కుడు రూ.80, ఆలుగడ్డలు రూ.50, ఎల్లిపాయలు రూ.250తో ధర పలికాయి.

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కౌటాల, డిసెంబరు 31: మండలంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని సిర్సా గ్రామానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారిగా రావడంతో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన గ్రామంలోని బీరప్ప ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగేగ్రామంలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తుల కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌గౌడ్, మిథున్, కవిరాజ్, భీమన్న పాల్గొన్నారు.

అదుపు తప్పి జీపు బోల్తా: హమాలీ మృతి

తిర్యాణి, డిసెంబరు 31: మండలంలోని రాళ్లకన్నపెల్లి గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తాపడి హమాలి దాసరి భూమయ్య(45)మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం పత్తిలోడ్ చేయడానికి రాళ్ల కన్నెపల్లి వైపు వెళ్లిన వాహనం అక్కడ పత్తి లేదని తెలియడంతో తిరుగుప్రయాణం అయింది. ఇదే క్రమంలో రాళ్లకన్నెపల్లి మూలమలుపు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ఆసమయంలో డ్రైవర్ మల్లేష్‌తోపాటు భూమయ్య వాహనంలో ఉండగా మల్లేష్‌కు స్వల్పగాయాలు కాగా భూమయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని తిర్యాణి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భూమయ్యకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరు కుమారుల్లో ఒకరు దివ్యాంగుడు. ఆసుపత్రిలో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

గంజాయిని అరికట్టాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 31: గంజాయిను అరికట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా వారు మాట్లాడుతూ గంజాయి స్మగ్లర్లు జిల్లాలో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారని అన్నారు. రాత్రి సమయాల్లో గంజాయి అమ్ముతున్నారన్నారు. దీంతో యువతమత్తులో మునుగుతున్నారని అన్నారు. పోలీసులు నిఘా పెంచి గంజాయిని పూర్తిగా అరకట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కార్తీక్, టీకానంద్, రాజ్‌కుమార్, పురుషోత్తం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నయా జోష్

- 2024 సంవత్సరంపై.. కోటి ఆశలు
- జోరందుకున్న మద్యం, మాంసం విక్రయాలు
- కేక్‌లకు భలే గిరాకీ
- ఆనందోత్సహాల్లో మునిగి తేలిన యువత
- మార్కెట్‌లో న్యూఇయర్ సందడి



ఆసిఫాబాద్, డిసెంబరు 31: కొత్త సంవత్సరానికి కొంగొత్త ఆశలతో జిల్లావాసులు స్వాగతం పలికారు. 2023సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. 2024కు స్వాగతం పలుకుతూ ఆదివారం అర్థరాత్రి 12గంటలకు జిల్లావ్యాప్తంగా యువత కేరింతలతో హంగామా చేశారు. తమ ఆశలు ఫలించాలని, కోరికలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ న్యూఇయర్‌కు వెల్‌కమ్ చెప్పారు.

ఈ సంవత్సరంలో మంచి వర్షాలు కురిసి పంటలు పండాలని రైతులు, వ్యాపారాలు వృద్ధి చెందాలని వ్యాపారవర్గాలు, వేతనాలు పెరగాలని ఉద్యోగులు, పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు, ప్రజల్లో తమ పలుకుబడి పెరగాలని రాజకీయ నాయకులు.. ఇలా ఎవరికి వారు తమ ఆశలు.. ఆశయాలు నెర వేరాలని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.



ఆసిఫాబాద్‌లో కేక్ దుకాణాల ఎదుట కోలాహలం

జోరుగా మాంసం, మద్యం, కేకుల విక్రయాలు..

వేడుక అంటే ఖానా.. పీనా.. జోష్.. ఎంజాయ్. దీంతో ఆదివారం ఉదయం నుంచే మాంసం విక్రయాలు కొనసాగగా మధ్యాహ్నం నుంచి మద్యం షాపుల వద్ద సందడి కనిపించింది. పార్టీలు జరుపుకోవడానికి వేదికలను వెతుక్కున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు విభిన్న వంటకాలను తెప్పించుకొని రుచులు ఆస్వాదించారు. జిల్లా అంతా పలుచోట్ల ఏర్పాటు చేసిన కేకుల దుకాణాలు, బేకరీల వద్ద కేకులను కొనుగోలు చేస్తూ యువత, విద్యార్థుల సందడి కనిపించింది. జనవరి1కి స్వాగతం చెబుతూ తమ ఇళ్ల లోగిళ్లను రంగులమయం చేసేందుకు రంగులను, టపాసులను కాల్చడానికి పలు రకాల బాంబులు, తారాజువ్వలను కూడా కొనుగోలు చేశారు. దూర దేశాల్లో, పలు ప్రాంతాల్లో ఉన్న వారికి ఆన్‌లైన్‌లో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పోలీసుల బందోబస్తు..

న్యూ ఇయర్ వేడుకల్లో ఎలాంటి అపశృతులు చోటుచేసుకోకుండా జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు ప్రధానకూడళ్ల వద్ద ప్రత్యేక తనిఖీ చేపట్టారు.



యాజమాన్య చర్యలను ఖండిస్తున్నాం: ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, డిసెంబర్ 31: నస్పూర్‌కాలనీలో తుల అనిల్ అనేకార్మికుడు తనకు కేటాయించిన క్వార్టర్‌లో చిన్న షెడ్డు నిర్మించుకుంటే, యాజమాన్యం దానిని దౌర్జ న్యంగా కూల్చివేయడాన్ని ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా తెలిపారు. ఈమేరకు ఆదివారం వారు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. యాజమాన్యం 40ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. షెడ్‌నిర్మాణానికి కార్మికులు దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారన్నారు. సింగరేణికి చెందిన ఎన్నో భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోని యాజమాన్యం కార్మికుల కట్టడాలను కూల్చి వేయడం దారుణమన్నారు.

యాజమాన్యమే షెడ్లునిర్మించాలి: ఐఎన్‌టీయూసీ

కార్మికులు నివసిస్తున్న క్వార్టర్ల ముందు కంపెనీ సొంత ఖర్చులతో షెడ్లునిర్మించి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ ఏరియాఉపాధ్యక్షుడు శంకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులు తమసొంత ఖర్చులతో షెడ్డు నిర్మించుకుంటే ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడడం సరికాదన్నారు. యాజమాన్యం తమ సొంత ఖర్చులతో షెడ్లు నిర్మించి ఇచ్చేలా తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మికులు ఆందోళన చెందవద్దని, కార్మికులపక్షానతాము పోరాడుతామని ఆయన తెలిపారు.

కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దు

మందమర్రి టౌన్, డిసెంబరు 31: సింగరేణి కార్మికుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేయాలని ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయడానికి పై నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ప్రధానంగా కార్మికులకు మారుపేర్ల మార్పు, సొంతింటి కల, కార్మికేతరులు ఆక్రమించుకున్న క్వార్టర్లను కార్మికులకు ఇప్పించడం లాంటి కార్యక్రమాలకు సిద్ధంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు గనులు, డిపార్టుమెంట్ల వారీగా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో బీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, సోముశెట్టి రాజేశం, దేవసాని సాంబయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 31: సింగరేణిలో రిటైర్డు కార్మికులకు వేజ్‌బోర్డు బకాయిలు, దీపావళి బోనస్, లాభాల వాటాలు చెల్లించాలని రిటైర్డ్ కార్మిక నాయకులు రేణికుంట్ల కొమురయ్య, రాంరవిందర్, బొలిశెట్టి రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విరమణ పొందిన వెంటనే కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాల్సింది పోయి వివిధ నిబంధనలతో ఆపడం సరికాదన్నారు. గతంలో అసెంబ్లీ, సింగరేణి ఎన్నికలని జాప్యంచేశారన్నారు. సింగరేణి రిటైర్డు కార్మికులు ఆర్థికఇబ్బందుల్లో ఉన్నారన్న విషయాన్ని గమనించాలన్నారు.